క్లుప్తంగా

కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన నేడు

కోవూరు : స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మండల కేంద్రంలో సోమవారం పర్యటిస్తారని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఆదివారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన పంపిణీ చేస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు పేదలకు భూపట్టాల పంపిణీ

పొదలకూరు : మండలంలోని పులికల్లు గ్రామంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు భూపట్టాలను అందజేస్తారని తహసీల్దార్ కె.వీర వసంతరావు ఆదివారం తెలిపారు. ముందుగా మార్గమధ్యలో మొగళ్లూరులో ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొనాల్సిందిగా సూచించారు.

శ్రీరామునిలా శ్రీకృష్ణుడు ధర్మస్వరూపుడు

నెల్లూరు(బృందావనం): శ్రీరామచంద్రునిలా శ్రీకృష్ణుడు ధర్మస్వరూపుడని ప్రముఖ వక్త ఆంధ్రోపన్యాసకుడు డాక్టర్ సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా వాల్మీకి పోలూరి హనుమజానకీ రామశర్మ శతజయంతి ఉత్సవాల నాల్గో సమావేశాన్ని పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం నిర్వహించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాసుదేవ కథాసుధ గ్రంథంపై సాయికుమార్‌రెడ్డి ఉపన్యసించారు. హనుమజానకీ శర్మ తన వాసుదేవ కథాసుధలో శ్రీనాథుని, శ్రీకృష్ణుని సరిపోలుస్తూ శ్రీమత్‌రామయణ, భారత, భాగవత కథలలో హరివంశం, విష్ణుపర్వం, భవిష్య పర్వంలలో ఉన్న యదార్థ గాథలను సవివరంగా వివరించారని విశ్లేషించారు. ఈ సందర్భంగా హనుమజానకీశర్మ రచించిన భారతీయ సాహిత్య సంస్మృతి ప్రకాశం గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయికుమార్‌రెడ్డిని నిర్వాహకులు మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, నలుబోలు బలరామయ్యనాయుడు, వేదం రామకృష్ణారెడ్డి, ఏ జయప్రకాష్, తదితరులు సత్కరించారు.

మాస్టర్ అథ్లెట్స్‌కు పతకాల పంట

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అథ్లెట్స్ జాతీయస్థాయి పోటీల్లో రాణించి అత్యధిక పతకాలు సాధించారని ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం దర్గామిట్టలోని అసోసియేషన్ కార్యాలయంలో జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన మాస్టర్ అథ్లెట్స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు పూణేలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పదిహేను పతకాలను సాధించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు రత్నర, కార్యదర్శి కోటేశ్వరమ్మ, జాయింట్ సెక్రటరీ ప్రసాద్‌బాబు, సాయిరాం, మహీపతి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుండె వ్యాధి నిపుణులు సీఎస్ శ్రీనివాసరాజు హాజరై ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే సత్యనాథ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామారావు, కార్యదర్శి జీవీ సురేంద్రబాబు, ట్రెజరర్ ఏ సాయిరాం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి ఆరాధన

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో త్యాగరాజస్వామి ఆరాధనా మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మందిరంలో కొలువైన సీతారామ లక్ష్మణ సమేత హనుమంతునికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు స్థానిక సంగీత కళాకారులతో శ్రీ త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల గానం, 4 గంటలకు వయోలిన్ ద్వయం , అనంతరం సింహపురి వీణాత్రయం, వారి శిష్యబృందం 25 మంది, వీణవైణికులచే నాద నీరాజనం ఘనంగా జరిగింది. అనంతరం సంగీత గురువారం, వారి శిష్యబృందం వంద మంది సంగీత కళాకారులు త్యాగరాజ దివ్యనామ సంకీర్తనలను ఆలపించారు. సంగీత కళాకారిణి శ్రీలక్ష్మీకామాక్షి బృందం పంచరత్న కీర్తనలను గానం చేశారు. వీణత్రయం పద్మాచక్రవర్తి, హేమలక్ష్మి, నాగలక్ష్మిచే వీణాత్రయం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సీతారామస్వామి మందిరం, వాకాటి నరసయ్య, త్యాగరాజ కల్యాణ మండపం నిర్వాహకులు అమర మోహన్‌రావు, అమర్తనూరు వెంకటేశ్వర్లుగుప్త, ఎంపీ ఆంజనేయులు, ఎస్వీ రత్నం, ఎస్ వెంకయ్య, సీహెచ్.సుబ్రహ్మణ్యం, అద్దేపల్లి సుబ్బారావు, ఎస్ పూర్ణచంద్రరావు, ఎం సూర్యనారాయణ, పీ ఆంజనేయులు పర్యవేక్షించారు.

అభివృద్ధిలో ఆదర్శం మరుపూరు

మండలంలోని మరుపూరు గ్రామం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎంతో ఆదర్శంగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో ప్రగతి పరుగులు తీసింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. మూడు దశాబ్దాల్లో జరగని పనులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో మూడేళ్లలో పూర్తి చేయడం విశేషం.

- మూడు దశాబ్దాల్లో చేయలేని పనులు మూడేళ్లలో పూర్తి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన రూపురేఖలు
- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న పేదలు


గ్రామానికి వెళ్లేందుకు నిర్మించిన రోడ్డు

పొదలకూరు : గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మరుపూరులో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామంలో బడి, గుడి, సిమెంటు రోడ్లు, సైడ్ కాలువలు, శ్మశానవాటిక, తాగునీటి సౌకర్యం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్, సచివాలయం, బల్క్ మిల్క్ యూనిట్ భవనాలు ఇలా అన్నీ సమకూరాయి. గ్రామస్తులకు ఎక్కడా అభివృద్ధిలో వెలితి లేకుండా పనులు పూర్తయ్యాయి. మరుపూరు సచివాలయ పరిధిలోని చాటగొట్ల గ్రామంలో కూడా అభివృద్ధి, సంక్షేమ పనులు రూ.కోట్లలో జరిగింది.

గ్రామంలో అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరుపూరులో రూ.కోటి నిధులతో సీసీరోడ్లు, రూ.1.20 కోట్లతో సైడ్‌డ్రైయిన్లు, రూ.1.10 కోట్లతో గ్రామానికి రింగ్‌రోడ్డు, రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.21 లక్షలతో వైఎస్సార్ రైతుభరోసా, రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.16 లక్షలతో బల్క్‌మిల్క్ యూనిట్(పాల సేకరణ కేంద్రం), రూ.3 లక్షలతో(కేంద్ర నిధులు) మరుగుదొడ్లు, బీసీ కాలనీలో రూ.3 లక్షలతో కల్వర్టు, జీసీ పాఠశాలలో రూ.2.50 లక్షలతో డ్రెయిన్ నిర్మాణాలు జరిగాయి. రూ.23 లక్షలతో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్, రూ.5 లక్షలతో వాటర్‌ప్లాంట్, దాతలు జీని దామోదరం, జీని రామ్మూర్తి సహకారంతో రూ.30 లక్షలతో వైకుంఠధామంలో కర్మక్రతువులు, దహనశాల, మరో రూ.15 లక్షలతో ప్రహరీ పనులు పూర్తయ్యాయి. మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జెడ్పీహైస్కూల్‌కు రూ.80 లక్షలు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి. ఇవి కాక ఇంకా సీసీరోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనులకు ఇటీవల రూ.కోటి నిధులు అదనంగా మంజూరై పనులను పూర్తి చేశారు.

మరుపూరులో జరిగిన అభివృద్ధి పనులు	64
వెచ్చించిన నిధులు	రూ.11.69 కోట్లు
చాటగొట్లలో జరిగిన అభివృద్ధి పనులు	28
వెచ్చించిన నిధులు	రూ.4.82 కోట్లు

మరుపూరు సచివాలయ పరిధిలో..	
డీబీటీ లబ్ధిదారులు	4,826 మంది
నాన్ డీబీటీ లబ్ధిదారులు	2,003 మంది
జరిగిన మొత్తం లబ్ధి	రూ.22,10,74,562


రక్షిత తాగునీటి ట్యాంకు


మరుపూరు గ్రామ సచివాలయం


అభివృద్ధి చేసిన శ్మశానవాటిక

ఠంచన్‌గా పింఛన్ ఇస్తున్నారు



మా వలంటీర్ ఒకటో తేదీ తెల్లవారక ముందే ఠంచన్‌గా పింఛన్ రూ.3 వేలు అందజేస్తున్నాడు. ఇంతకంటే ప్రభుత్వ పనితీరును ఏం చెప్పగలం. మాలాంటి పేదలకు సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదుకుంటున్నారు.

– ఆలూరు పరమేశ్వరి, గ్రామస్తురాలు, మరుపూరు

మా కాలనీకి సిమెంటురోడ్లు వేశారు



గతంలో మా కాలనీ గురించి పట్టించుకున్న వారు ఎవరూ లేరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సిమెంటురోడ్లు, మురుగుకాలువలు నిర్మించారు. సంక్షేమ పథకాలు సకాలంలో అందుతోంది.

– చదమల రాజు, గ్రామస్తుడు, మరుపూరు

చారిత్రాత్మకం



మా సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమం చారిత్రాత్మకమని చెప్పాలి. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నాను. గతంలో ఎప్పుడూ ఇంతటి అభివృద్ధి జరగలేదు. మంత్రి కాకాణి కృషి ఫలితంగానే మా గ్రామం ఆదర్శంగా నిలిచింది.

– వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, మరుపూరు

రూ.కోట్ల నిధులతో పనులు



మరుపూరు సచివాలయ పరిధిలో సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్లు, భవనాలు కలిపి సుమారు రూ.16 కోట్ల మేర జరిగాయి. ఇంత పెద్దఎత్తున నిధులు సాధించడం గొప్పవిషయం. గ్రామస్తుల సహకారంతో పనులను సకాలంలో పూర్తి చేశాం.

– కె.కసనానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, పొదలకూరు

99 శాతం హామీలు అమలు


వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన మంత్రి కాకాణి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన 99 శాతం హామీలు అమలయ్యాయని రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంటపాళెంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, సుబ్బారెడ్డిపాళెంలో రూ.40 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన గోడౌన్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి-సంక్షేమ పథకాల అమలు ద్వారా గ్రామాల రూపురేఖలనే మార్చి వేసిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే తీసుకొచ్చిన ఘతన సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

సోమిరెడ్డికి సీటు రాకపోవడం బాధాకరం

టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డికి సర్వేపల్లి సీటు ప్రకటించకపోవడం బాధగా ఉందని మంత్రి కాకాణి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్థాయి అని చెప్పుకునే సోమిరెడ్డిని చంద్రబాబు కరుణించలేదన్నారు. సర్వేపల్లి నుంచి పోటీ చేసేందుకు సోమిరెడ్డి పేరుకు బదులు మరో పేరు వినిపించడం, రెండో కృష్ణుడు రంగంలోకి రావడం నిజంగా బాధ కలుగుతోందన్నారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ నేత మారు సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో యువత బైక్ ర్యాలీ ద్వారా కాకాణికి ఘనంగా స్వాగతం పలికింది. దివంగత వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్‌లు ఆలపాక శ్రీనివాసులు, కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, స్టేట్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, చెంగారెడ్డి పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం


రైతులకు పాస్‌బుక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న పాల్గొని, వలంటీర్లను సత్కరించారు. తొలుత ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు, రీసర్వే చేసిన పొలాలకు సంబంధించి రైతులకు పాస్‌బుక్‌లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 41 మందికి సేవావజ్ర, 225 మందికి సేవా రత్న, 12,517 మందికి సేవా మిత్ర అవార్డులతో పాటు రూ.19.64 కోట్లు పంపిణీ చేశామన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఐదుగురికి సేవావజ్ర, 25 మందికి సేవా రత్న, ఏడాది పాటు ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేసిన 1,744 మందికి సేవా మిత్ర అవార్డులు ఇస్తున్నామన్నారు. ఎటువంటి లింకు డాక్యుమెంట్లు అవసరం లేకుండా 500 ఇంటి స్థలాల పత్రాలను పేదింటి అక్కచెల్లెమ్మలకు అందజేసినట్లు వివరించారు. పేదలకు పక్కా గృహాల కల్పనలో దేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. మండలంలో 1,400 మంది అన్నదాతలకు పాస్‌బుక్‌లు పంపిణీ చేశామన్నారు. గ్రామ వలంటీర్లు తమ బాధ్యతలను ఉద్యోగంలా కాకుండా సేవగా భావిస్తూ సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తున్నట్లు తెలియజేశారు.


హాజరైన వలంటీర్లు, గ్రామ ప్రజలు

పకడ్బందీగా గ్రూప్–2 పరీక్షలు

పొదలకూరు : పట్టణంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణ ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. పొదలకూరు సీఐ ఆర్.రాంబాబు పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. పట్టణంలో కాకతీయ డిగ్రీ, జూనియర్ కాలేజీలు, ఎస్బీవీడీ కాలేజీ, డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో గ్రూపు-2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించారు. రూట్ ఆఫీసర్‌గా జిల్లా డ్వామా పీడీ డి.వెంకట్రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 740 మంది అభ్యర్థులను కేటాయించినట్లు తెలిపారు.

మూడు పరీక్ష కేంద్రాల్లో..

వెంకటాచలం: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వెంకటాచలంలోని క్యాబా ఇంజినీరింగ్ కళాశాల, టోల్‌ప్లాజా వద్దనున్న స్వాతి కళాశాల, కాకుటూరులోని కృష్ణచైతన్య పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


పొదలకూరు : పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ రాంబాబు

122 మంది హాజరు

ముత్తుకూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్షలకు 144 మందికి గానూ 122 మంది హాజరయ్యారు. పోలీసుల బందోబస్తు నడుమ పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. రూట్ ఆఫీసర్‌గా వ్యవహరించిన జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంఈఓలు, హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు : పట్టణ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

గరుడ వాహనం బహూకరణ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి తన్నీరు సుబ్రహ్మణ్యం రూ.2 లక్షల విలువైన గరుడ వాహనాన్ని ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహణ కమిటీ ఉపాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం కుటుంబం రూ.15 లక్షలతో దేవస్థానం ధ్వజస్తంభాన్ని అందజేసినట్లు తెలిపారు. దేవస్థానం సభ్యులు పి.సుబ్బానాయుడు, చొప్పా వెంకటేశ్వర్లు, ఎం.శ్యామ్‌ప్రసాద్, ఆకులూరు హేమంత్, దాసరి శ్రీనివాసులు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విడవలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-73వ సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఒకరినొకరు సంతోషంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు చేస్తున్న వృత్తి వివరాలను తెలుసుకోవడంతో పాటు దూరమైన స్నేహితులను తలుచుకుని కంటతడి పెట్టుకున్నారు. అనంతరం పాఠశాలకు అవసరమైన వసతుల గురించి హెచ్‌ఎం రామును అడిగి తెలుసుకున్నారు. వారి ద్వారా పాఠశాలకు సైకిల్ స్టాండ్, ఫ్యాన్లు, ఫర్నీచర్ కావాలని తెలుసుకుని వాటిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులైన సోమవరపు జనార్దన్ రెడ్డి, దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, ఎస్.రవికుమార్‌రెడ్డి, వి.చంద్రశేఖరయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతుల సంక్షేమమే ముఖ్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రైతుల సంక్షేమమే తమ సంస్థ లక్ష్యమని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ రమణారెడ్డి అన్నారు. పట్టణంలోని వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ సమావేశ మందిరంలో ఆ సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కంపెనీల నుంచి కొనుగోలు చేసి నేరుగా రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల పెంపకంపై అవగాహన

ముత్తుకూరు : రొయ్యల పెంపకంలో రైతులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని ఆక్వా నిపుణుడు డాక్టర్ ఆనందప్రసాద్ అన్నారు. మండలంలోని తాళ్లపూడిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ మూడో రోజు ఆదివారం ఆక్వాపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మత్స్యకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శ్రీవిద్య, త్రివేణిల ఆధ్వర్యంలో చేపలు, రొయ్యలకు వ్యాపించే జబ్బులు, వాటిని వినియోగించే మందుల గురించి రైతులకు వివరించారు. ఆక్వా క్లినిక్ అనే అంశంపై రైతులకు సమగ్రంగా విశదీకరించారు.


ఆక్వా మందులపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



కోవూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో 70వ అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక ఆదివారం జరిగింది. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహకుడు లవకుమార్, కార్యదర్శి విజయానందం, ఉపాధ్యక్షుడు జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.